నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 2 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మంచిర్యాల టౌన్ : వ్యాపారులకు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

నిబంధనలు ఉల్లంఘిస్తే ఇబ్బందులే

సిబ్బందితో మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, నవంబర్ 1 : నిబంధనలు ఉల్లంఘిస్తే ఇబ్బందులు తప్పవని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం కమిషనరేట్‌లో ఏఆర్, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోంగార్డులతో నిర్వహించిన దర్బార్‌కు ఆయన హాజరై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా ఇబ్బందులుంటే నేరుగా తనను సంప్రదించవచ్చునని తెలిపారు. మంచిర్యాల, పెద్దపల్లిలో 494 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

రామగుండం కమిషనరేట్‌లో గురువారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. సీపీ శ్రీనివాస్ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో దేశ సమగ్రతను కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు.

యూడీఏలతో జీపీల ఆదాయానికి బ్రేక్

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటు
- ఆదిలాబాద్ పరిధిలో 107, మంచిర్యాలలో 350, నిర్మల్‌లో 420 పల్లెలను చేర్చిన ప్రభుత్వం
- ఇక ఏ నిర్మాణమైనా యూడీఏల నుంచి అనుమతి తప్పనిసరి
- ప్రజలపై ఆర్థిక భారం

ఖజానా నింపుకునేందుకు సర్కారు కొత్త పోకడ

మంచిర్యాల, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకునేందుకు కొత్త పోకడలకు పోతున్నది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. అభివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సర్కారు చెబుతుండగా, ఈ విధానం వల్ల గ్రామ పంచాయతీల ఆదాయానికి గండి పడి, వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ఉమ్మడి జిల్లాలో మూడు యూడీఏలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు కాబోతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో నిర్ణయం తీసుకోగా ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు సంబంధించి జీవోలు జారీ అయ్యాయి. ఆదిలాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి ఆదిలాబాద్ మున్సిపాలిటీతో పాటు ఆరు మండలాల్లోని 107 పల్లెలు, మంచిర్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, నస్పూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లోని 350 పల్లెలు, నిర్మల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లోని 420 పల్లెలోను చేర్చింది.

పంచాయతీల ఆదాయానికి గండి

ఇప్పటికే ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలకు అథారిటీలు కొత్త కష్టాలను తెచ్చిపెట్టనున్నాయి. గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణ అనుమతుల నుంచి వచ్చే బెటర్‌మెంట్, డెవలప్ మెంట్ ఫీజులు ఇప్పటి వరకు పంచాయతీల ఖాతాల్లోనే జమ అవుతుండగా, అర్బన్ అథారిటీ పరిధిలోకి వచ్చిన తర్వాత మాత్రం డెవలప్ మెంట్ ఫీజులన్నీ అథారిటీ అకౌంట్‌కు చేరనున్నాయి. దీని వల్ల పంచాయతీలకు ఆదాయం పూర్తిగా తగ్గిపోతుంది. అప్పుడు పంచాయతీలు కేవలం ఆస్తి పన్నులు, చెత్త సేకరణ యూజర్ చార్జీల మీదే ఆధార పడాల్సి వస్తుంది. దీంతో పాటు అథారిటీలు రూపొందించే మాస్టర్ ప్లాన్ విషయంలోనూ ఎక్కువగా మండలాలను పరిగణలోకి తీసుకుంటారు. దీంతో రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, మిక్స్‌డ్ జోన్లుగా ప్రాంతాలు విభజన చేయాల్సి ఉంటుంది. ఫలితంగా ఎవరి ఇష్టానుసారం వాళ్లు నిర్మాణాలు చేసుకోవడానికి ఆస్కారం ఉండదు. పంచాయతీలు అనుమతులు ఇవ్వడానికి అథారిటీ చట్టాలు ఒప్పుకోవు. దీని వల్ల సమస్యలు వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. అలాగే, పంచాయతీల్లో వివిధ నిర్మాణ అనుమతుల ద్వారా వచ్చే ఆదాయాలను అథారిటీలు అదే పంచాయతీల్లో వెచ్చించే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ఈ రంగంలోని నిపుణులు చెబుతున్న దాని ప్రకారం చూస్తే అర్బన్ అథారిటీ అమల్లోకి వచ్చిన తర్వాత ఏ పంచాయతీలైనా సరే 300 చదరపు మీటర్లకు మించి విస్తీర్ణంలో నిర్మాణం చేయాలంటే ఆయా అర్బన్ అథారిటీల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే, జీ ప్లస్ 3 దాటే నిర్మాణాల అనుమతుల కోసం అర్బన్ అథారిటీకి వెళ్లాల్సిందే. అలాగే అర్బన్ అథారిటీ పరిధిలోకి వచ్చే ఏ పంచాయతీలో అయినా వాణిజ్య నిర్మాణాలు చేపడితే తప్పనిసరిగా అథారిటీకి వెళ్లాల్సిందే. అది ఏ చిన్న వాణిజ్య నిర్మాణమైనా సరే... ఉదాహరణకు కోళ్ల షెడ్స్ వంటి ఇతర ఎలాంటివైనా అథారిటీ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. దీనికి ఆయా అథారిటీల్లో నిర్ణయించిన మేరకు ఫీజులు కూడా భారీగానే ఉండే అవకాశం ఉంది. అలాగే, ఇంటి పన్నులు భారీగా పెరగనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అన్ని జిల్లాల్లోని పంచాయతీల్లో మాస్టర్ ప్లాన్ అమలు చేయడం కోసం జిల్లా టౌన్ కంట్రీ, ప్లానింగ్ ఆఫీసర్(డీటీసీపీ) ఉన్నారు. ప్రస్తుతం జిల్లా మొత్తాన్ని అర్బన్ అథారిటీ పరిధిలోకి తీసుకుంటున్న పరిస్థితుల నేపథ్యంలో ఈ విభాగం పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి

పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకం

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పేరుతో తీసుకుంటున్న ఈ నిర్ణయం వెనుక ప్రభుత్వం ఆదాయం పెంచుకోవాలన్న ఎత్తుగడ కనిపిస్తున్నా పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ రంగంలోని వివిధ నిపుణుల ద్వారా సేకరించిన సమాచారం చూస్తే.. అథారిటీలు అమల్లోకి వస్తే పంచాయతీలు ఆర్థికంగా పూర్తిగా చితికిపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం పంచాయతీలకు వివిధ రూపేణా వస్తున్న పన్నులు, ఇతర ఆదాయాల్లో ఇక నుంచి మెజార్టీ శాతం అర్బన్ అథారిటీలకు సమకూరనున్నాయి. పల్లె ప్రజలు పంచాయతీలను విడిచి తమ పనులకోసం అథారిటీల వెంట తిరగాల్సి వస్తుందని తెలుస్తోంది. అథారిటీల ఏర్పాటు, దాని వెనుక దాగి ఉన్న అంశాలను లోతుగా విశ్లేషించి చూస్తే పంచాయతీల మనుగడకు ఇబ్బంది తప్పదని తెలుస్తోంది. అర్బన్ అథారిటీల విస్తరణతో గ్రామ పంచాయతీల ఆదాయాలకు కోతలు పడనున్నాయి. వీటితోపాటు ఒక స్థాయి దాటిన భవన నిర్మాణ అనుమతుల కోసం, వాణిజ్య అవసర నిర్మాణ అనుమతుల కోసం ఇక ముందు అర్బన్ అథారిటీల వద్దకు వెళ్లాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల ఆయా గ్రామ పంచాయతీల పరిధిల్లో ఉన్న ప్రజలకు ఇబ్బందులు వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీ పరిధిలో గృహ నిర్మాణాలు, వాణిజ్య నిర్మాణాలు ఏవి చేసినా పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని అక్కడి నుంచే అనుమతులు తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉండే అవసరాలకు అనుగుణంగా, పంచాయతీ రూపొందించిన ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తీర్ణం వాటిని పరిగణనలోకి తీసుకొని నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. కాగా అర్బన్ అథారిటీ పరిధిలోకి వస్తే 30 ఫీట్లకు తక్కువగా రోడ్డు ఉండే అనుమతులు దొరకడం కష్టమే. అలాగే అర్బన్ అథారిటీ మాస్టర్ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. పూర్తిగా స్థానికంగా ఉండే ప్రజలకు ఇబ్బందులు తీసుకువచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

వైభవంగా వెలుగుల వేడుక

పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

బెల్లంపల్లి : కుటుంబ సభ్యులతో కలిసి పటాకులు కాల్చుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నమస్తే బృందం: మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రజలు దీపావళి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇండ్లు, దుకాణాలు, వ్యాపార సముదాయాలను అందంగా అలంకరించి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా పటాకులు కాల్చారు. శుక్రవారం ఇళ్లలో కేదారేశ్వర స్వామికి నోములు, వ్రతాలు ఆచరించారు. బంధువులను ఇంటికి పిలిచి భోజనాలు పెట్టారు. మంచిర్యాలలో గురువారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు.. ఆయన తనయుడు, బీఆర్ఎస్ యూత్ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు వ్యాపారులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తన నివాసంలో కుటుంబ సమేతంగా పటాకులు కాల్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్ పూజలు చేశారు. మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది దీపాలు వెలిగించి, స్వచ్ఛ దీపావళి వేడుకలను జరుపుకున్నారు. గిరిజన గూడేల్లో నిర్వహించి దండారీ వేడుకలు ఆకట్టుకున్నాయి. సిర్పూర్(యు) మండలం పిట్టగూడ గ్రామంలో నిర్వహించిన గుస్సాడీ సంబురాల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పాల్గొన్నారు. మహిళలతో కలిసి ఆడి పాడారు. సహపంక్తి భోజనం చేశారు.

సిర్పూర్(యు) : గుస్సాడీ సంబురాల్లో ఎమ్మెల్యే కోవలక్ష్మి

వాంకిడి గిరిజన ఆశ్రమంలో ఫుడ్ పాయిజన్

- దవాఖానల్లో చికిత్సపొందుతున్న విద్యార్థినులు
- పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

బోరు నీటి శాంపిళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

వాంకిడి, నవంబర్ 1 : వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి ఫుడ్ పాయిజన్‌తో 30 మంది విద్యార్థినులు అస్వస్థతతకు గురైన విషయం విదితమే. వాంకిడి ప్రభుత్వ దవాఖానలో చేర్పించగా, చికిత్స అనంతరం 27 మందిని తిరిగి హాస్టల్‌కు చేర్చారు. ఇందులో కొంత మంది విద్యార్థినులకు మళ్లీ వాంతులు విరేచనాలు కావడంతో తిరిగి దవాఖానలకు తరలించారు. మంచిర్యాల దవాఖానలో నాలుగురిని చేర్పించగా, మరో ఏడుగురిని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లోని దవాఖానలకు తరలించారు. ఇక మరో నలుగురు వాంకిడి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వైద్యసిబ్బంది ఆశ్రమంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అంతకుముందు ఫుడ్ సేఫ్టీ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు వచ్చి నీటి, ఆహార పదార్థాల శాంపిళ్లను సేకరించారు. విద్యార్థినుల అస్వస్థతతకు కలుషితమై తాగు నీరు, ఆహారమే కారణమని వైద్యులు చెబుతున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ శుక్రవారం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల అస్వస్థతతకు గల కారణాలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బోరు నీటి శాంపిళ్లను ఆయన పరిశీలించారు. అనారోగ్యానికి గురైన పిల్లలకు ఆయిల్ ఫుడ్ కాకుండా పండ్లరసాలు, పెరుగన్నం ఇవ్వాలని, వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని హెచ్ఎం, వార్డెన్‌ను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

పట్టుబడ్డ గంజాయిని పరిశీలిస్తున్న ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

ఏపీ టు ఎంపీ

- పుష్ప సినిమా తరహాలో ప్రత్యేక అరలు ఏర్పాటు చేసి రవాణా
- రూ.72.50 లక్షల విలువైన 290 కిలోల గంజాయి పట్టివేత
- పోలీసుల అదుపులో డ్రైవర్ బల్వీర్ సింగ్

ట్యాంకర్‌లో గంజాయి తరలిస్తుండగా వాంకిడి వద్ద పట్టుకున్న పోలీసులు

ట్యాంకర్‌లోని గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ వాంకిడి, నవబర్ 1 : ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండి నుంచి మధ్యప్రదేశ్‌కు సినీ ఫక్కీలో గంజాయిని తరలిస్తుండగా, వాంకిడి చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. రూ. 72.50 లక్షల విలువైన 290 కిలోల మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్ బల్వీర్‌సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలో ఇంత పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడడం ఇదే మొదటిసారి కాగా, స్థానికంగా కలకలం రేపుతున్నది.

వాంకిడి చెక్‌పోస్టు వద్ద..

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సరిహద్దులో ఉన్న వాంకిడి చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఆసిఫాబాద్ నుంచి మహారాష్ట్ర వెపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను అడ్డుకొని పరిశీలించారు. అందులో భారీ మొత్తంలో గంజాయి బయటపడింది. మధ్యప్రదేశ్‌లోని మోరైనా ప్రాంతానికి చెందిన డ్రైవర్ బల్వీర్ సింగ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, అరబింద్ అనే వ్యక్తి గంజాయి తీసుకొచ్చేందుకు తనను రాజమండ్రికి పంపాడని, అక్కడి నుంచి గంజాయి లోడ్ చేసుకొని వస్తున్నానని తెలిపినట్లు ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. 145 గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని, ఒక్కొక్కటి సుమారు రెండు కిలోలు ఉంటుందని, మొత్తం 290 కిలోలు పట్టుకున్నామని, వీటి విలువ సుమారు రూ. 72.50 లక్షలు ఉంటుందని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన అరబింద్‌ని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని మధ్యప్రదేశ్‌కు పంపించినట్లు ఆయన వివరించారు. కాగా, కొన్ని నెలలుగా రాజమండ్రి నుంచి మధ్యప్రదేశ్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు డ్రైవర్ వెల్లడించడం విశేషం. అరబింద్ ఒక్కో ట్రిప్పునకు రూ. లక్ష వరకు ఇస్తాడని, నెలలో రెండు.. మూడుసార్లు గంజాయిని తరలిస్తున్నానని డ్రైవర్ తెలిపినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

సినీ ఫక్కీలో..

అక్రమ దందాలపై పోలీసుల నిఘా పెరుగుతున్న కొద్దీ స్మగ్లర్లు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. సీనిఫక్కీలో దందా సాగిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. వాంకిడి చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డ గంజాయి ఘటన కూడా అదే తరహాలోనే ఉంది. పుష్పసినిమాలో పాలట్యాంకులో ఎర్రచందనాన్ని స్మగ్లింగ్ చేసిన విధంగానే ఆయిల్ ట్యాంకర్ మధ్యలో ప్రత్యేక అరలను ఏర్పాటు చేసి గంజాయి రవాణాకు ప్రయత్నించారు. ఇటీవల జిల్లా మీదుగా సాగుతున్న అక్రమ రవాణాలన్నీ ఇలా కొత్త తరహాలోనే సాగుతున్నాయి. గతంలో ట్రక్కులు, ఐచర్ వంటి వాహనాల్లో పశువులను తరలించే వ్యాపారులు.. ఇప్పుడు కంటెయినర్లు వాడుతుండడం గమనార్హం.

ఎస్పీఎం సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ

కాగజ్‌నగర్, నవంబర్ 1 : సిర్పూర్ పేపర్ మిల్లు (జేకే) యాజమాన్యం, లారీ అసోసియేషన్ ప్రతినిధుల మధ్య 36 రోజులుగా వివాదం కొనసాగుతుండగా, ప్రభుత్వం జోక్యం చేసుకున్నది. ఈ మేరకు ప్రత్యేక కమిటీని నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే చైర్మన్‌గా, ఎస్పీ శ్రీనివాస రావు, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ రాంచందర్, వరంగల్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ రాజేంద్ర ప్రసాద్, నోడల్ అధికారి రాంమోహన్, జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ అశోక్‌లను సభ్యులుగా నియమించింది. ఈ విషయ మై ఎస్పీఎం యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. న్యాయబద్ధంగా సమస్య పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నది.

ప్రాణం తీసిన ఈత సరదా

కొండు అరుణ్ (ఫైల్)

దాసరి సాయి (ఫైల్)

- గోదావరిలో మునిగి ఇద్దరు విద్యార్థుల గల్లంతు
- మృతదేహాలను వెలికితీసిన గజ ఈతగాళ్లు
- పండుగ పూట విషాదం.. కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు

చెన్నూర్ రూరల్, నవంబర్ 1 : దీపావళి సెలవులకు ఇంటికొచ్చిన ఇద్దరు విద్యార్థులు గోదావరిలో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం దుగ్నెపల్లిలో శుక్రవారం జరగగా, ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. దుగ్నెపల్లికి చెందిన కొండ పోచయ్య-శోభ చెన్నూర్‌లో నివాసముంటున్నారు. వీరి కుమారుడు అరుణ్(19) కిష్టంపేట డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అలాగే అదే గ్రామానికి చెందిన దాసరి కృష్ణ-మధులత దంపతులు రామగుండంలో ఉంటున్నారు. వీరి కుమారుడు సాయి (16) కరీంనగర్‌లోని ఎస్ ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దీపావళి సెలవులు రావడంతో స్వగ్రామానికి తిరిగివచ్చారు. ఈ క్రమంలో అరుణ్, సాయి శుక్రవారం ఉదయం తమ స్నేహితులతో కలిసి అన్నారం బ్యారేజ్ సమీపంలోని గోదావరికి ఈతకు వెళ్లారు. బ్యారేజ్ గేట్లు తీసి ఉండడంతో వరద ఉధృతికి అరుణ్, సాయి గల్లంతయ్యారు. మిగతా నలుగురు స్నేహితులు క్షేమంగా ఒడ్డుకు చేరారు. 10 మంది గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టి అరుణ్, సాయి మృతదేహాలను వెతికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పండుగ పూట ఇద్దరు మృత్యువాత పడగా, వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

ఆర్ఎస్పీ ఇంట్లో చోరీ

ఇంటి తాళం పగుల గొట్టి తెరచిన తలుపు

కాగజ్‌నగర్, నవంబర్ 1 : కోసిని జీపీ పరిధిలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు రూరల్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. రాత్రి ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా పగులగొట్టి విలువైన పత్రాలు దొంగలించారు. సిర్పూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి నక్క మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, నవంబర్ 1 : సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ దీపక్ కుమార్ అన్నారు. శుక్రవారం రాపల్లి గ్రామంలో జరుగుతున్న ఇంటింటి కుటుంబ సర్వేప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర అంశాలపై ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కేటాయించిన ఎన్యుమరేటర్ బ్లాక్‌ల ప్రకారం నిర్ణీత నమూనాలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో, తదితరులు ఉన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

- మంచిర్యాల జిల్లాలో నేలకొరిగిన పంటలు
- పలుచోట్ల తడిసిముద్దయిన పత్తి
- దమ్మన్నపేటలో పిడుగుపడి మహిళ మృతి

కన్నెపల్లి/దండేపల్లి/కాసిపేట/తాండూర్/నెన్నెల, నవంబర్ 1 : మంచిర్యాల జిల్లాలో గురువారం రాత్రి నుంచి కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. భీమిని మండలం వడాల గ్రామంలో విఠల్‌కు చెందిన ఎకరం వరి నేలకొరిగింది. అలాగే పలు గ్రామాల్లో తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి తడిసిముద్దయ్యింది. దండేపల్లి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో చేతికొచ్చిన పంట నేలకొరగడంతో రైతన్న కుదేలవుతున్నాడు. మామిడిపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దమ్మన్నపేటకు చెందిన గడ్డం నాగమ్మ(31) పిడుగుపడి శుక్రవారం మృతిచెందింది. నాగమ్మ తన భర్త ప్రశాంత్‌తో కలిసి పత్తి చేనులో పనిచేస్తుండగా ఒక్కసారిగా పిడుగు పడి నాగమ్మ స్పృహతప్పి పడిపోయింది. స్థానికులు 108లో దవాఖానకు తరలించే లోపే మృతి చెందింది. ప్రశాంత్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కాసిపేట మండలంలో భారీ వర్షం పడగా, చాలాచోట్ల వరి పంట నేలకొరిగింది. మల్కేపల్లి, దేవాపూర్, పెద్దనపల్లి గ్రామాల్లో వర్షానికి దెబ్బ తిన్న పంటలను మండల వ్యవసాయాధికారి ప్రభాకర్, ఏఈవోలు దీప్తి, రమ్య పరిశీలించారు. తాండూర్ మండలంలో శుక్రవారం ఉదయం ఈదురు గాలులతో భారీ వర్షం పడింది. ఏరిడానికి సిద్ధంగా ఉన్న పత్తి నేలరాలింది. కూరగాయల నారుమడులు సైతం చెల్లాచెదురయ్యాయి. గోపాల్‌నగర్‌కు చెందిన రైతు శ్రీనివాస్‌కు చెందిన 5 ఎకరాల వరి నేలకొరగడంతో వ్యవసాయ విస్తరణ అధికారి శంకర్ పరిశీలించారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన

నెన్నెల మండల కేంద్రంలో రైతు సంఘం (ఏఐకేఎంఎస్) మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రైతు సంఘం మంచిర్యాల జిల్లా కార్యదర్శి కొండు బానేష్ మాట్లాడుతూ రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల పంటలు నేలమట్టమై రైతన్నలు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పంటనష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని, పత్తికి ఎకరాకు రూ. 40 వేలు, వరికి ఎకరాకు రూ. 20 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంట రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి అనిల్ కుమార్, రైతు సంఘం గ్రామ కార్యదర్శి దుర్గం మొండయ్య, కొండు సాయి కుమార్, సునార్కర్ లింగయ్య, దుర్గం ఇస్తారి, మిరం పోశం, సాగర్, రాంటెంకి దేవయ్య, తాళ్లపల్లి లింగన్న, దుర్గం పోచమ్మ, మల్లేశ్, దుర్గం రాజం, సునర్కర్ శంకర్, దుర్గం పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి : మామిడిపెల్లి సమీపంలో నేలకొరిగిన వరి

నెన్నెల : రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల నిరసన

కన్నెపల్లిలో తడిసిన పత్తి పంట